క్లుప్తంగా

జీఓ 85 రద్దు చేయాలి



వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

విజయనగరం ఫోర్ట్: పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ 85ను రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని శాంతియుత ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ట్లాడుతూ.. వైద్యులకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులకు టైమ్ బాండ్ ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

అధ్వానంగా నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారి



ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న పంట పొలాల నీరు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో అధ్వానంగా మారింది. ముఖ్యంగా గొర్లిపేట సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద రోడ్డుపై నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అంతర పంటలతో ఆదాయం..

పూసపాటిరేగ : కొబ్బరిసాగులో అంతర పంటగా కోకో సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారులు జ్యోత్స్న, అఖిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పతివాడలో కొబ్బరిసాగులో అంతర పంటలపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేసినట్లయితే లాభాలు ఎక్కువ వస్తాయన్నారు. 90 శాతం రాయితీపై ప్రభుత్వం అందజేస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు గణేష్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


కూలి రేట్లను ప్రకటించండి..



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లిమర్ల: ఏపీ బెవరేజెస్ హమాలీలకు కూలీరేట్ల ఒప్పందం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక బెవరేజెస్ డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చిన నేపథ్యంలో కొత్త కూలి రేట్లతో ఒప్పందం చేయాల్సి ఉందన్నారు. ఒక బాక్సుకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 7.35ను ఎనిమిది రూపాయలకు పెంచాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిపో మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీను, డిపో కార్యదర్శి కార్తీక్, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడు బంగారయ్యను సత్కరిస్తున్న సర్పంచ్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మండలంలోని తంగుడుబిల్లి ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు బంగారయ్యను గ్రామ పెద్దలు, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, సర్పంచ్ పిన్నింటి చిన్నప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, తదితరులు అతన్ని సత్కరించి, ఆయన విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాలూరి తిరుపతిరావు, మహాలక్ష్మంనాయుడు, శ్రీను, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలోని కందర్పకాలనీలో గల సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విజయనగరం వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ కన్వీనర్ నల్లా శకుంతల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా పలువురు మహిళలకు గర్భాశయ, ఇతర క్యాన్సర్లకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పి. చంద్రిక, నాగలక్ష్మి, ఇందిర, సౌజన్య, గౌరి, నాగసీత, సరస్వతీ శిశుమందిర్ కార్యదర్శి కందర్ప మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఇందిరాబాల, చరితాదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు వేళాయె..

- నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు తేదీలు ఖరారు
- ఈ నెల 23,24,25 తేదీల్లో జరగనున్న క్రీడా పోటీలు
- మూడు రోజుల పాటు ఏడు క్రీడాంశాల్లో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు



కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో సాధన చేస్తున్న క్రీడాకారులు

విజయనగరం: పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు స్కూల్ గేమ్స్ పోటీలు చక్కటి వేదికగా నిలవనున్నాయి. ప్రతి ఏడాదీ నిర్వహించే పోటీల్లో భాగంగా నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహించేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల షెడ్యూల్ ఖరారు కావడంతో నియోజకవర్గ స్థాయి పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయడంలో జిల్లా విద్యాశాఖ, వ్యాయామ ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి మూడు రోజుల పాటు ఏడు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పోటీల్లో అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాల విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులుగా నిర్వాహకులు ప్రకటించారు. మూడు రోజుల పాటు జరగనున్న పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తుండగా.... పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించనున్నారు.

23 నుంచి విజ్జి స్టేడియంలో జరగనున్న పోటీలు: ఈ నెల 23, 24, 25 తేదీల్లో నగర శివారుల్లో గల విజ్జి స్టేడియంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. మొదటి రోజు 23న అండర్-14 విభాగంలో బాల, బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, షటిల్‌బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా.... రెండో రోజు 24న అండర్ -17 విభాగంలో ఇవే క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. 25న అండర్-14, 17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హత కల్పిస్తారు. మొదటి రోజు పోటీలను విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు ప్రారంభించనున్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి అవసరమైన అర్హత పత్రాలను వెంట తీసుకు రావాల్సి ఉంటుంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..



విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను నిరూపించుకునేందుకు స్కూల్ గేమ్స్ మంచి అవకాశం. ఈ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత కల్పిస్తారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన వారికి క్రీడల కోటలో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆసక్తి గల క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చు.

– కె. తౌడుబాబు, నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల ఇన్‌చార్జ్, విజయనగరం

జల జీవరాశులను కాపాడాలి

- ఇన్‌కాయిస్ సంస్థ శాస్త్రవేత్త సునీత



ముక్కాంలో సముద్రతీర ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న ఇన్‌కాయిస్ శాస్త్రవేత్త సునీత, మెరైన్, సచివాలయ సిబ్బంది

భోగాపురం: కాలుష్య కోరల నుంచి సముద్రంలోని జల జీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత మత్స్యకారులందరిపై ఉందని ఇన్‌కాయిస్ సంస్థ శాస్త్రవేత్త పి. సునీత అన్నారు. మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్‌కాయిస్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ముక్కాం సముద్రతీర ప్రాంతంలో స్వచ్ఛ సాగర్ - సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సముద్రతీరంలో ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో పాటు చెత్తాచెదారాలను ఏరి వేశారు. సముద్రతీర పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. మత్స్య సంపదను కాపాడుకోవడంతో పాటు సముద్ర జలాలు, తీరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనేక విపత్తులను ఎదుర్కోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షుడు గుంటు సత్తయ్య, మత్స్యశాఖ అధికారి షరీఫ్, గ్రామపెద్దలు బడే నాయుడు, మసీన, సచివాలయ, మెరైన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లను బాగు చేయండి

- జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటనాయుడు



మాట్లాడుతున్న జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరడాన వెంకట నాయుడు

విజయనగరం: రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరడాన వెంకటనాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిందని, ఈ నేపథ్యంలో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా బొబ్బిలిలో రోడ్లు పూర్తిగా పాడై ఎక్కడ కక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు చింతపల్లి దుర్గారావు, పైల జ్యోతి, కనిగిరి శ్రీనివాసరావు, పాడుగు రామకృష్ణ, ముదిలి వెంకటరమణ, నక్కా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి భగత్‌సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్



భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: భారత విద్యార్థి ఫెడరేషన్ విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో గురజాడ కళాక్షేత్రంలో జరగబోయే భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు శనివారం కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడేందుకు ఎస్ఎఫ్ఐ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించబోయే ఫెస్ట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు 98663 02963 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొనాలనుకునే విద్యార్థులు 94943 33511 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమాలన్నీ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయని చెప్పారు.

గురజాడ బాటలో పయనిద్దాం....



డెంకాడ: లైబ్రరీలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మహేష్,పాఠకులు



నెల్లిమర్ల: డైట్ కళాశాలలో గురజాడ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

అభ్యుదయ కవి గురజాడ చూపిన బాటలో అందరం పయనిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. గురజాడ వేంకట అప్పారావు జయంతిని వాడవాడలా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రచనా శైలిని పలువురు వివరించారు. సమాజంలోని వివక్షతను తన రచనల ద్వారా చీల్చిచెండాడిన ధీరుడని కొనియాడారు.

– డెంకాడ/నెల్లిమర్ల/విజయనగరం పూల్‌బాగ్

అక్టోబర్ 2 వరకు 'స్వచ్ఛతా హి సేవ'



విజయనగరం: పారిశుధ్య సిబ్బందికి పరికరాలు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు



విజయనగరం అర్బన్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసన్



విజయనగరం ఫోర్ట్: అర్బన్ హోమ్‌లెస్ షెల్టర్‌ను శుభ్రం చేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

విజయనగరం: అక్టోబర్ రెండో తేదీ వరకు నగరంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు అన్నారు. నగరంలోని రాక్ గార్డెన్‌లో శనివారం శ్రమదానం చేపట్టడంతో పాటు పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత పరిరక్షణ పరికరాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ప్రజారోగ్య సిబ్బంది అంబటిసత్రం నుంచి రాక్‌గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పవచ్చన్నారు. కార్యక్రమంలో టీపీఆర్ఓ సింహాచలం, సన్యాసిరావు, ప్రజారోగ్య సిబ్బంది బాలకృష్ణ, సాలెం రాజు, అంజిబాబు, రవి శేఖర్, రామకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీలో..

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షణ, కాలుష్య నివారణపై యూనివర్సిటీ నుంచి జేఎన్‌టీయూ జీవీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బొంతు కోటయ్య సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

విజయనగరం ఫోర్ట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్, అర్బన్ హోమ్‌లెస్ షెల్టర్‌లను శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు చెక్ అందజేస్తున్న కొట్టాం యువత

విజయనగరం అర్బన్: విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందిన యువత ముందుకొచ్చారు. ఈ క్రమంలో గ్రామస్తుల నుంచి 40 వేల రూపాయలు సేకరించి, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో గొరవల్లి ఈశ్వరరావు, వేచలపు మహేష్, తగరంపూడి సన్యాసిరావు, గుర్రపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పూరిల్లును పరిశీలిస్తున్న వీఆర్వో సుజాత

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీ దిబ్బలపాలెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో పెంటుమాని సీతమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమయింది. ఈ ప్రమాదంలో తులం బంగారంతో పాటు రూ.30 వేలు కాలి బూడిదయ్యాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వీఆర్వో సుజాత శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలిని పరామర్శించారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

- అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విశాఖ కళాకారులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే యాగశాలలో నిత్య హోమాలు, స్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కళారాధన కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నానికి చెందిన పలువురు కళాకారులు స్వామి సన్నిధిలో భక్తి సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నసమారాధన



భోగాపురం: పెద్దవీధిలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

భోగాపురం: మండల కేంద్రంలోని పెద్దవీధిలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది భక్తులు హాజరై స్వామి ప్రసాదం స్వీకరించారు.



డెంకాడ: వినాయక ప్రసాదం స్వీకరిస్తున్న చిన్నారులు

సత్యనారాయణపురంలో..

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ ఎదురుగా ఉన్న సత్యన్నారాయణపురం గ్రామంలో వినాయక ఉత్సవంలో భాగంగా అన్నసమారాధన చేపట్టారు. వందలాది మంది భక్తులు పాల్గొనగా.. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పైడితల్లి జాతరకు పక్కా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: ప్రజలందరి సహకారంతో ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లమ్మ జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వచ్చే నెల 14, 15 తేదీలలో నిర్వహించనున్న అమ్మవారి సిరిమానోత్సవానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. భక్తులకు మరుగుతొడ్లు, తాగునీరు కల్పించడంతో పాటు పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుపతిరావు, సభ్యులు అల్లు చాణక్య, జీవీ రంగారావు, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేయాలి

- కేంద్ర మాజీ మంత్రి అశోక్



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్

విజయనగరం రూరల్: ప్రజా ప్రతినిధులెవ్వరైనా నిత్యం ప్రజల కోసమే పనిచేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. శనివారం స్థానిక అశోక్ బంగ్లాలో నిర్వహించిన విజయనగరం నియోజకవర్గ విస్తృతత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ స్థాయిలో టీడీపీ మరింత బలోపేతం కావాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాన్సాస్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న ఎన్నో సేవలను అడ్డుకోవడం ఇంకా మరిచిపోలేదని చెప్పారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనను రాష్ట్ర ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సలహాలు, సూచనలు అందించండి




వ్యవసాయ పరిశోధన స్థానంలో కొర్ర పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, శాస్త్రవేత్తలు

విజయనగరం ఫోర్ట్: రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ పంటలలో అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి టీఎస్ఎస్‌కే పాత్రో, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ కెల్ల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఘనంగా గురజాడ జయంతి



జేఎన్‌టీయూ జీవీలో గురజాడ కాంస్య విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి



గురజాడ పబ్లిక్ స్కూల్‌లో చిన్నారుల విచిత్ర వేషధారణ

విజయనగరం అర్బన్: పట్టణంలోని వివిధ విద్యాలయాల్లో గురజాడ వెంకట అప్పారావు జయంతి కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో మహాకవి గురజాడ అప్పారావు 162వ జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం), యూనివర్సిటీ సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో తొలిత యూనివర్సిటీ ప్రాంగణంలో గురజాడ కాంస్య విగ్రహాన్ని యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ గురజాడ రెండు శతాబ్దాల ముందు చూపు కలిగిన గొప్పదార్శనికుడని, ఆయన సాహిత్యం నేటి తరానికి గొప్ప స్ఫూర్తినిస్తుందని అన్నారు. విద్యార్థులందరూ ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని కోరారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెగుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గురజాడ స్త్రీల సమస్యలపై మంచి సాహిత్యాన్ని రాసారని స్త్రీల శ్రమశక్తి వంటింటిలో నిర్వీర్యం అయిపోతుందని వంటిల్లు నిషేధించాలని గురజాడ పేర్కొన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, యూనవర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే.బాబులు, విగ్రహదాత ఆర్ ఎంపీసీ ట్రస్ట్ చైర్మన్ వీవీ రమణ మూర్తి, వివిధ విభాగాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతం విద్యాసంస్థల్లో..

పట్టణంలోని సీతం విద్యాసంస్థల్లో శుక్రవారం గురజాడ జయంతోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో, తోటపాలెం సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆధ్వర్యంలో జరిగాయి. సాహితీ వేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురజాడ పబ్లిక్ పాఠశాలలో..

పట్టణంలోని గురజాడ పబ్లిక్ పాఠశాలలో గురజాడ అప్పారావు జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు విచిత్ర వేషధారణ నిర్వహించారు. గురజాడ వేషధారణలో చిన్నారుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.